గుండాలపేటలో సీసీ కెమెరాలు ఏర్పాటు

విశాలాంధ్ర-డెంకాడ : ప్రభుత్వ ఆదేశాలు మేరకు విజయనగరం జిల్లా ఎస్పీ ఉత్తర్వులలో భాగంగా సీసీ కెమెరాలు ఏర్పాటులో భాగంగా శుక్రవారం డెంకాడ ఎస్సై సన్యాసి నాయుడు ఆధ్వర్యంలో గుండాలపేట గ్రామంలో గ్రామ పెద్ద మరియు జనసేన పార్టీ నేత అయిన కాళ్ళ స్వామి సహకారంతో గ్రామంలో ఆంజనేయ స్వామి వారి టెంపుల్ మరియు రెండు మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహాలు వద్ద అదే విదంగా గ్రామ ప్రధాన రహదారులు కవర్ అయ్యే విదంగా ఈరోజు 04 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడమైనది అనంతరం పెదతాడివాడ గ్రామంలో అంబేద్కర్ విగ్రహం, గ్రామంలోకి వచ్చు ప్రధాన రహదారి కవర్ అయ్యే విదంగా ప్రవీణ్ సహకారంతో 02 కెమెరాలు ఏర్పాటు చేసినట్లు డెంకాడ ఎస్సై ఏ సన్యాసినాయుడు తెలిపారు.

మళ్ళీ మూతపడిన జిందాల్ పరిశ్రమ..!

- అర్ధరాత్రి నుంచి లేఆఫ్ ప్రకటించిన జిందాల్ యాజమాన్యం
- ముడిసరుకులు, విద్యుత్ చార్జీల ఇబ్బందులే కారణమంటూ నోటీసు
- రోడ్డునపడ్డ 400మంది కార్మిక కుటుంభాలు
- పరిశ్రమ ఎదుట మోహరించిన పోలీసు బలగాలు
- ఆందోళనబాటలో కార్మికులు



విశాలాంధ్ర-కొత్తవలస : పారిశ్రామిక రంగానికి కొన్నాళ్ళుగా ఏర్పడ్డ గడ్డు పరిస్థితిలో ఏవిధమైన మార్పు కనిపించలేదు.... ఇందుకు ఉదాహరణగా విజయనగరం జిల్లా కొత్తవలస మండలంలోని అప్పన్నపాలెం వద్దగల జిందాల్ స్టెయిన్లెస్ స్టీల్ కర్మాగారం మరోమారు మూతపడటమే... దశాబ్దాల కాలంగా ఇక్కడ నెలకొల్పిన పరిశ్రమతో వందలాది మంది ఉపాధిని పొందుతున్నారు. విజయవంతంగా కొనసాగిన ఈ పరిశ్రమకు 2020-21 మధ్య కాలంలో తీవ్ర ఇబ్బందులతో సంక్షోభం నెలకొంది. దీంతో అప్పట్లో దాదాపు 11నెలల పాటూ కంపెనీ మూతపడింది. మళ్ళీ గతేడాది మే నెలలో అదే పరిస్థితి కారణంగా మరో 5నెలల పాటూ పరిశ్రమకు తాళాలేశారు. కార్మిక సంఘాల పోరాటాలు, అభ్యర్ధన మేరకు సెప్టెంబరులో యాజమాన్యం పరిశ్రమను తెరిచినా మళ్ళీ సంక్షోభం ముంచుకొచ్చింది. పరిశ్రమలో ఉత్పత్తికి అవసరమయ్యే ముడిసరుకులు చివరిదశకు చేరుకోవడాన్ని గమనించిన కార్మికులు 2రోజులుగా పనులకుసైతంహాజరుకాలేదు. పరిశ్రమ మూసేస్తారా... కొనసాగిస్తారా... అనే అంశాలపై స్పష్టత ఇచ్చేవరకూ పనులుచేయ్యమంటూ యాజమాన్యానికి గురువారం తేల్చిచెప్పారు. పరిస్థితిని తిరిగి కార్మికులతో చర్చించకుండానే అర్ధాంతరంగా అర్ధరాత్రి యూనిట్ హెడ్ దినేష్ శర్మ పరిశ్రమకు లేఆఫ్ ప్రకటిస్తూ నోటీస్ జారీచేయడంతో కార్మికుల్లో కలవరం మొదలైంది. పరిశ్రమ నిర్వహణ, ఉత్పత్తికి గానూ ఎఫ్.పి.పి.సి.ఎ చార్జెస్(ఫ్యూయల్ పవర్ పర్చేస్ కాస్ట్ అడ్జస్మెంట్) 2022-23, 2023-24కి గానూ అధిక భారం, ప్రస్తుతం ముడిసరుకుల ధరలు అమాంతం పెరగటం, లభ్యం కాకపోవవడం, రవాణా, విద్యుత్ చార్జీల పెనుభారం వంటి ఇబ్బందుల కారణమంటూ యాజమాన్యం పరిశ్రమ ఆవరణలో నోటీసును అంటించారు. దీంతో ఒక్కసారిగా రెగ్యులర్, కాంట్రాక్ట్ కార్మికులు సుమారు 400 మంది కార్మిక కుటుంభాలు రోడ్డునపడ్డాయి. యాజమాన్యం తీసుకున్న లేఆఫ్ నిర్ణయం ఎప్పటితో కొలిక్కి వస్తుందో అంతుచిక్కక లబోదిబోమంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పరిశ్రమ డిజిఎం గోపాలకృష్ణ వద్ద ప్రస్తావించగా పరిశ్రమ నిర్వహణ నష్టాల్లో ఉండటంతో ఇబ్బందులు పడుతున్నామని, తప్పని పరిస్థిల్లో యాజమాన్యం ఈ నిర్ణయం తీసుకుందని ఆయన స్పష్టం చేసారు. ఇదిలా ఉండగా వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు పిల్లా అప్పలరాజు, గాడి అప్పారావు తదితరుల ఆధ్వర్యంలో పరిశ్రమ ఎదుట యాజమన్యానికి వ్యతిరేకంగా ఆందోళనకు దిగారు. ఏవిధమైన అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కొత్తవలస సిఐ షణ్ముఖరావు, ఎస్సై సుదర్శన్ నేతృత్వంలో పోలీసుబలగాలు మొహరించాయి.

కౌముది పరిషత్ 90వ వార్షికోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్ : పట్టణంలోని రింగ్ రోడ్ శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం ప్రాంగణం ఆశ్రిత వేదికపై శుక్రవారం ఉదయం కౌముది పరిషత్ (సాహితి, సాంస్కృతిక సంస్థ) 90వ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన సభా కార్యక్రమంలో అవధాని భారతి, బ్రహ్మశ్రీ డా.కట్టమూరి చంద్రశేఖరమ్ అవధాన కార్యక్రమాలు ప్రారంభించి ఏభై ఏళ్ళు పూర్తి చేసుకున్నందున కౌముది పరిషత్ ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షుడు ధవళ సర్వేశ్వరరావు, కార్యదర్శి మానాప్రగడ సాహితీతో పాటు అతిధులు చంద్రశేఖరమ్ దంపతులను శాలువాతో సన్మానించి సన్మానం గ్రహీతకు కౌముది పురస్కారం సాహితీ సార్వభౌమ బిరుదు ప్రదానం చేశారు.నగరానికి చెందిన సాహితీ,నాటకం, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, కళా సంస్థలు పురస్కార గ్రహీతను సన్మానించాయి. ముందుగా సభలో పాల్గొన్న విశిష్ట అతిధి విజయనగరం నగర కార్పొరేషన్ కమీషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ కౌముది పరిషత్ సాహితి సేవలు అన్ని సమయాల్లో చూడలేమని అభిప్రాయం వ్యక్తం చేశారు. సాహితీ సాంస్కృతిక రంగాల్లో విజయనగరం రాజధానిగా పేరొందడానికి కౌముది పరిషత్ వంటి సంస్థలు, సాహితీవేత్తలు, కళా సంస్థలు నిలవడమేనన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన వైయాకరణ సార్వభౌమ.డా.ఏ.గోపాలరావు మాట్లాడుతూ ప్రముఖ రచయిత పంతులు లక్ష్మి నారాయణ కారణమని తొంభై ఏళ్ళుగా సాహితీ రంగాన సేవలందిస్తున్న కౌముది పరిషత్కు మధురవచస్వి మానాప్రగడశేషసాయి, కళాప్రపూర్ణులు, సాహితీ వేత్తలు క్రుషిచేస్తూన్నారని అన్నారు. ఈ కార్యక్రమానికి విజయవాడకు చెందిన అచ్చతెలుగు శతావధాని .డా.పాలపర్తి శ్యామల ప్రసాద్, విశ్రాంత సంస్క్రుతోపాన్యాసకులు పిజిటివి. రంగాచార్యులు, విశ్రాంత డిఆర్ఓ.డి. గణపతిరావు, పువ్వాడ శ్రీ హరి.శ్రీనివాస సేవా సంఘం కార్యదర్శి చెరుకూరి శ్రీధర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంక్షేమ సంఘం అధ్యక్షుడు టి.వి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో స్వచ్ఛంద భూదానోద్యమం రావాలి : భీశెట్టి

ఘనంగా ఆచార్య వినోబా బావేకి నివాళులు

విశాలాంధ్ర-విజయనగరం రూరల్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో స్వచ్ఛంద భూదానోద్యమంకి రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సేవా సంస్థలు శ్రీకారం చుట్టాల్సిన అవసరం ఉందని లోక్ సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో స్వచ్ఛంద భూదాన ఉద్యమం సృష్టికర్త స్వాతంత్ర్య సమరయోధుడు ఆచార్య వినోబా భావే చేపట్టిన భూదాన ఉద్యమం డెబ్బై ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వినోబా బావేకు ఘననివాళులు అర్పించారు. ఈ సందర్భంగా భీశెట్టి మాట్లాడుతూ 1951 ఏప్రిల్ 18 న వినోబా భావే పాదయాత్ర చేస్తూ తెలంగాణా లోని పోచంపల్లి లో స్వచ్ఛంద భూదాన్ ఉద్యమానికి శ్రీకారం చుట్టి అక్కడ జమీందారు వెదిరే రామచంద్రారెడ్డి మనసుని గెలిచి వంద ఎకరాల భూమిని దానంగా స్వీకరించారని, సుమారు 1లక్షా 30 వేల ఎకరాలు తెలంగాణ లో ఆంధ్రప్రదేశ్ లో 80 వేల ఎకరాలు వినోబా భావే సేకరించినవి ఉన్నాయని, ఉమ్మడి రాష్ట్రంలో సుమారు రెండు లక్షల యాభై ఎకరాలు పేద ప్రజలకు అందించారని, దేశవ్యాప్తంగా ఆరున్నర సంవత్సరాల పాటు 80 వేల కిలోమీటర్ల పాదయాత్ర చేసి దాదాపు 50 లక్షల ఎకరాల భూమిని దానంగా స్వీకరించి 1965 లో అప్పటి ప్రధాని లాల్ భాహదూర్ శాస్త్రి ఆధ్వర్యంలో భూదాన్ గ్రామ్ దాన్ చట్టం వచ్చేలా చేసారని కొనియాడారు, గ్రామీణ ప్రాంతాల్లో నిరు పేదలకు ప్రతి కుటుంబానికి 2 ఎకరాల భూమిని పంపిణీ చేసి వారు బ్రతికేందుకు తగిన చర్యలు తీసుకోవాలని వినోబా భావే ఆశించారని, ఈ దేశంలోని ప్రజలు ఒకరికొకరు సహకరించు కోవాలని తపన పడ్డారని అటువంటి మహనీయులు త్యాగమే నేటి భారత దేశం మని తన తాత గారు స్వతంత్ర సమరయోధులు స్వర్గీయ భీశెట్టి అప్పారావు అనకాపల్లి శాసనసభ్యుడుగా వినోబా భావే స్పూర్తితో స్వచ్ఛంద భూదాన్ ఉద్యమం లో పాల్గొని పేదలకు భూములు పంచారని భీశెట్టి తెలిపారు, ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అల్లంశెట్టి నాగభూషణం, తాట్రాజు రాజారావు,బోర రమేష్,పౌర వేదిక ప్రతినిధులు జలంత్రి రామచంద్ర రాజు,తాడేపల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

ఎన్.జి.ఓ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.వి.రమణ డిమాండ్

విశాలాంధ్ర-కొత్తవలస : రాష్ట్రంలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఎన్.జి.ఓ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.వి.రమణ డిమాండ్ చేశారు. కొత్తవలస మండలంలో కొత్తవలస తాలూకా యూనిట్ అధ్యక్షులు జె. వి. ప్రసాద్. అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సర్వ సభ్య సమావేశంలో రమణ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న వివిధ కేటగిరి ఉద్యోగులు రీ డిప్లాయిమెంట్ రద్దు చేయాలనీ., ఇప్పుడు పని చేస్తున్న సీనియర్ ఎ.ఎన్.ఎమ్స్ కి కౌన్సిలింగ్ నిర్వహించి ఖాళీలను భర్తీ చేసి, సచివాలయం హెల్త్ సెక్రటరీలు గ్రేడ్ -11 ఏ.ఎన్.ఎమ్స్ గా ప్రొమోషన్స్ లిస్ట్ జిల్లాల వారీగా తయారు చేయాలనీ డిమాండ్ చేసారు. హెల్త్ అసిస్టెంట్స్ రీ డిప్లాయిమెంట్ రద్దు చేసి ఆరోగ్య ఉపకేంద్రాలు వారీగా ఖాళీలను భర్తీ చేయాలనీ, ఉమ్మడి జిల్లాలో రీ డెప్లాయిమెంట్ చేస్తే పిల్లలు చదువులు, ఫ్యామిలీ ఒక దగ్గర,వీరు ఒక దగ్గర పనిచేయాల్సి వస్తుందని, అందరికి 55 సంవత్సరాలు పైబడి బీపీ లు, షుగర్ తో బాధ పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. వి.ఆర్.సి కమిషన్ చైర్మన్ ని నియమించాలని, ముందుగా ఐ.ఆర్ ప్రకటించాలని ఈ సందర్భంగా కోరారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం విడుదల చేసిన ఉద్యగుల బకాయిలు 6,200 కోట్లకు కృతజ్ఞతలు తెలిపారు. పంచాయతీ సెక్రటరీల జీతాల వ్యత్యాసాలు సరి చేయాలనీ, ఐ.సి.డి.ఎస్ ఉద్యోగులకి ఎఫ్.టి.ఏలు ఇంప్లిమెంట్ చేయాలనీ డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో తాలూకా సెక్రటరీ శ్రీను, ట్రజరర్ కృష్ణరావు, నాయకులు భాగ్యలక్ష్మి, స్వర్ణలత, ఈశ్వరరావు, కళావతి, సూర్యారావు, సత్యారావు, వెంకటరమణ, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్ పనుల నిర్వహణపై కేంద్ర బృందం పర్యటన

జలజీవన్ మిషన్ ప్రత్యేక అధికారి గంగూలీ

విశాలాంధ్ర-వేపాడ : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సుజల ప్రవంతి పథకంలో భాగంగా నిర్మించ తలపెట్టిన జల జీవన్ మిషన్ పనులను కేంద్ర బృంద ప్రత్యేక అధికారి గంగూలి శుక్రవారం పరిశీలించారు. మండలంలోని వీలుపర్తి, జాకేరు పంచాయితీలలో నిర్వహిస్తున్న జలజీవన్ మిషన్ పనులను జిల్లా ఆర్డబ్ల్యూఎస్ ఎస్.సి కవితతో కలసి పనుల నిర్వహణపై సమావేశం ఏర్పాటు చేసి ఆరా తీశారు.ఈ సందర్భంగా గ్రామాల్లో ఎన్ని ఇల్లు ఉన్నాయి, రక్షిత మంచినీటి పథకం నుండి ఎన్ని కొళాయి ట్యాపులు వేయించారు,అలాగే జలజీవన్ మిషన్ ద్వారా ఎన్ని ట్యాబులు వేసి ఉన్నాయి,ఇంకా ఎన్ని కావాల్సి ఉన్నవి,అలాగే వీటి నిర్వహణపై గ్రామంలో మహిళలు ఏ ప్రాతిపదికన నిర్వహించుటకు నిర్ణయించుకున్నారో, అలాగే ప్రతి ఇంటికి స్వచ్ఛమైన త్రాగునీరు అందుతుందా లేదా అన్న విషయాలపై అడిగి తెలుసుకున్నారు.అలాగే గ్రామానికి చెందిన మహిళలు జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి త్రాగునీరు అందుతుందని అలాగే కొళాయిల మైనర్ రిపేర్లు నిమిత్తం ప్రతి ఇంటి నుండి నెల నెల రూ.30లు వసూలు చేసి ప్రత్యేక బ్యాంకు ఖాతాలో వేసి ఖర్చు చేయడం జరుగుతుందని మహిళలు తెలిపారు.అలాగే అధికారులు కూడా సరియైన పద్ధతిలో జలజీవన్ మిషన్ పనులు నిర్వహించే విధంగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శానాపతి లీల అప్పారావు, గ్రామ పెద్దలు గోకాడ అచ్చం నాయుడు నాగభూషణం తదితరులతో పాటు ఆర్డబ్ల్యూఎస్ డీఈలు కె ఆర్ వి పైడ్రాజు, వెంకట్రావు, గోవిందరావు, ఆర్డబ్ల్యూఎస్ జే.ఈ దేవి, పంచాయతీ కార్యదర్శి ఎం రంగారావు, అంగన్వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్టేజ్-2 టెండర్ విదానంతో హమాలీలకు తీవ్ర అన్యాయం

వెంటనే ఈటెండర్ విదానాన్ని రద్దు చేయాలి

జిల్లా హమాలీ కార్మిక సంఘం అధ్యక్షుడు కామేశ్వరరావు డిమాండ్

విశాలాంధ్ర-విజయనగరం : పౌరసరఫరాల శాఖలో అధికారులు, ప్రభుత్వం హమాలీల పట్ల తీవ్ర వివక్షత చూపుతున్నారని, అందుకు ఉదాహరణే స్టేజ్-2 ఈటెండర్ విదానమని జిల్లా హమాలీకార్మిక సంఘం అధ్యక్షుడు, సిపిఐ రాష్ట్ర నాయకుడు పి. కామేశ్వరరావు ఆరోపించారు. శుక్రవారం ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ 1983 నుంచి వస్తున్న టెండర్ విదానం ద్వారా హమాలీలకు ఎటువంటి నష్టం లేదన్నారు. కానీ కొత్తగా స్టేజ్-2 పేరుతో ప్రస్తుతం పిలుస్తున్న టెండర్ వలన హమాలీల కడుపు కొడుతున్నారన్నారు. ఇది అత్యంత దుర్మార్గపు చర్యగా అభివర్ణించారు. ఈ టెండర్ విదానంలో హమాలీలకు పనిలేకుండా పోతుందని, కాంట్రాక్టర్‌కు పూర్తిగా బాధ్యతలను అప్పగిస్తారన్నారు. ఈవిదానాన్ని తామంతా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఇప్పటికే టెండర్‌లకోసం నోటీఫికేషన్ ఇచ్చారని, జాయింట్ కలెక్టర్ ఈవిషయంలో ఆలోచించి వెంటనే నోటిఫికేషన్ రద్దు చేయాలని డిమాండ్ చేసారు. లేనియెడల తామంతా తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. నిరుపేదలైన హమాలీల జీవితాలతో ఆడుకోవడం భావ్యం కాదని హితవు పలికారు.

ఇష్టారాజ్యంగా మట్టి అక్రమ తవ్వకాలు

చూసిచూడనట్టు వ్యవహరిస్తున్న సంబంధిత శాఖ అధికారులు

విశాలాంధ్ర-శృంగవరపుకోట : మండలం వీరనారాయనం గ్రామ రెవెన్యూ పరిధిలో ఉన్న నాయుడు చెరువు. గౌరమ్మ చెరువులో గత 15 రోజులుగా రాత్రి పగలు తేడా లేకుండా రెండు జెసిబిలు 20 ట్రాక్టర్లుతో చెరువులో మట్టిని రియల్ ఎస్టేట్ వెంచర్లు కప్పేందుకు మరియు ఇటుకల బట్టీలకు మట్టిని తరలిస్తూ ప్రభుత్వానికి చెందవలసిన ఆదాయాన్ని వారి జేబుల్లో వేసుకుంటున్నారు మట్టి మాఫియా, ఇంత జరుగుతున్న చూసిచూడనట్లు వ్యవహరిస్తున్న సంబంధిత శాఖ అధికారులు. వీరనారాయనం గ్రామ సచివాలయంకి అనుకొని వున్న గౌరమ్మ చెరువులో అక్రమంగా మట్టిని తరలిస్తున్న ఇంత జరుగుతున్నా కనీసం పట్టించుకోని రెవెన్యూ అధికారులు అని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా గ్రామానికి ఉన్న నాయుడు చెరువు. గౌరమ్మ చెరువు. ఈ రెండు చెరువుల్లో ఇష్టానుసారంగా మట్టిని తవ్వడం వలన గుంతలు గుంతలుగా ఏర్పడి వర్షాకాలంలో చెరువులు నిండి ఉన్న సమయంలో పశువులు ను బయటకు తోలుకు వచ్చే సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని. గుంతలు ఉన్నాయని తెలియక స్నానానికి దిగే పిల్లలు పెద్దవారు ప్రమాదానికి గురిఅయ్యే ఈఅవకాశం ఉందని, ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు చొరవ తీసుకుని చెరువులో అక్రమంగా మట్టిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

తిరుమల ప్రశాంతతకు భంగం కలిగించేందుకు భూమన కుట్ర

టీటీడీలో గోవుల మరణాలపై తప్పుడు ప్రచారం: ఎమ్మెల్యే కొండ్రు

విశాలాంధ్ర-రాజాం : తిరుమల ప్రశాంతతకు భంగం కలిగించేందుకు వైసీపీ నేత భూమన కరుణాకర రెడ్డి కుట్రకు తెరలేపుతున్నారని మాజీ మంత్రి తెలుగు దేశం పార్టీ రాజాం నియోజక వర్గం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ పత్రికా ప్రకటన విడుదల చేశారు. గోవులకు నాసిరకం దాణా, కాలంచెల్లిన మందులు ఇచ్చి నోరులేని మూగజీవాల ప్రాణాలను వైసీపీ నేతలు బలి తీసుకున్నారన్నారు. గోవులు మరణించిన ఆ లెక్కలు బయటకు రాకుండా తొక్కిపెట్టారు. ఈ అరాచకాలకు అప్పటి గోశాల డైరెక్టర్ హరినాథ్ రెడ్డినే బాధ్యుడు అని అన్నారు.వైసీపీ నేతలు గోశాలకు వచ్చి అక్కడ పరిస్థితులు పరిశీలించుకోవచ్చు అని ప్రభుత్వం విసిరిన సవాలు స్వీకరించేలేక పోతున్నారన్నారు. ధర్మబద్ధంగా నడుచుకుంటున్న కూటమి ప్రభుత్వంపై నిందలు మోపడం సరికాదన్నారు. నేడు కూటమి పాలనలో రుచికరమైన, నాణ్యమైన ప్రసాదం అందిస్తున్నామన్నారు. టీటీడీలో గోవుల మరణాలపై వైసీపీ తప్పుడు వార్తలను ప్రచారం చేస్తున్నారు.ప్రజల మనోభావాలను కించపరిచే ప్రయత్నం మానుకోవాలని హితవుపలికారు. కొన్ని గోవులు అనారోగ్యంతో సహజంగా మృతిచెందితే మతానికి రాజకీయానికి ఆపాదించడం సరికాదన్నారు. ఇలాంటి దుష్ప్రచారాలకు తెరలేపితే వైసీపీ మూలాలు కూడా పోతాయని ఎమ్మెల్యే కోండ్రు ఎద్దేవా చేశారు.

ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు

ఆధ్యాత్మిక రీతిలో పురవీదుల్లో ర్యాలీ

విశాలాంధ్ర-వేపాడ : మండల కేంద్రమైన వేపాడ వల్లంపూడి జంట గ్రామాల్లో గల క్రైస్తవుల సహాయమాత దేవాలయం కేథలిక్ సంఘం ఫాదర్ బాలరాజు ఆధ్వర్యంలో పవిత్ర శుక్రవారం రోజున గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఏసు క్రీస్తు పడినటువంటి శ్రమ బాధలను సిలువ మరణాన్ని ధ్యానిస్తూ ఆధ్యాత్మికమైన రీతిలో జంట గ్రామాలైన వేపాడ వల్లంపూడిలో గ్రామాల పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు.అలాగే క్రీస్తు ప్రభువు పట్ల ఉన్న ప్రేమను విశ్వాసాన్ని క్రీస్తుకు సాక్షులుగా ప్రకటించారు.అలాగే పవిత్ర శుక్రవారం అనగా గుడ్ ఫ్రైడే రోజున మన అందరి పట్ల చూపిన గొప్ప ప్రేమను అంతిమ త్యాగాన్ని గుర్తు చేసుకుంటూ సిలువకు కృతజ్ఞతతో మోకరిల్లి విశ్వాసంతో ప్రేమతో సిలువ మార్గంలో పాల్గొన్నారు.వేపాడ విచారణ కర్తలు ఫాదర్ బి. బాలరాజు, ఆర్ సి ఎం కేథలిక్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ గుడ్ ఫ్రైడే వేడుకలలో వేపాడ, వల్లంపూడి, వీలుపర్తి,దబ్బి రాజుపేట, బల్లంకి,పెదగుడిపాల, నీలకంఠ రాజపురం,రాయుడుపేట, సింగరాయి,కలకవలస గ్రామాల నుండి అధిక సంఖ్యలో పాల్గొని గుడ్ ఫ్రైడే వేడుకలను ఘనంగా నిర్వహించారు.

అగ్నిమాపక వారోత్సవాలు

విశాలాంధ్ర-గరివిడి : అగ్నిమాపక వారోత్సవాలు 2025 సంవత్సరంలో భాగంగా చీపురుపల్లి అగ్నిమాపక కేంద్రం వారు ఏప్రిల్ 18న దేవాడ పంచాయతీ పరిధిలో గల మోర్ ఎల్లాయ్స్ కంపెనీ నందు ఫైర్ అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ అవగాహన కార్యక్రమంలో భాగంగా కంపెనీలో పనిచేసే కార్మికులకు, ఇతర సిబ్బందికి, మేనేజ్మెంట్ కి ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్ ఫైర్స్, మెటల్ ఫైర్స్, ఓవర్ హీటింగ్ ఫైర్ అలాగే వివిధ ఇతర కారణాల రీత్యా జరిగే అగ్ని ప్రమాదాలను కార్బన్డయాక్సైడ్ ఫైర్ ఎక్స్టింగ్విషర్, డ్రై కెమికల్ పౌడర్ ఫైర్ ఎక్స్టింగ్విషర్ల ద్వారా ఏ విధంగా ఆర్పువచ్చో కూలంకుషంగా తెలియజేసి,ఎక్స్టింగ్విషర్ల పాడైనప్పుడు వాటి మెయింటెనెన్స్ ఎలా చేయాలి అనే విషయాలను తెలియజేయడమైనది. మేనేజ్మెంట్ వారికి అగ్నిమాపక పరికరాలను నెలవారి, అదేవిధంగా సంవత్సరం వారీగా ఎలా మెయింటెనెన్స్ చేయాలో తెలియచెప్పడమైనది. అలాగే 3నెలలకు ఒకసారి మాక్ డ్రిల్ తప్పనిసరిగా కండక్ట్ చేయాలని తెలియజేయడమైనది. మొత్తం ఉద్యోగస్తుల్లో 40శాతం తప్పనిసరిగా ఫైర్ డిపార్ట్మెంట్ నుండి 3 రోజుల ట్రైనింగ్ తీసుకోవాలని తెలియజేయడమైనది. అదే విధంగా ఫైర్ అవగాహన సంబంధించి ముందు జాగ్రత్తలతో కూడిన సూచనలు సలహాలు పాంఫ్లెట్స్ ను కంపెనీ మేనేజ్మెంట్ వారికి, కార్మికులకు ఇవ్వటం జరిగింది. ఈ కార్యక్రమంలో చీపురుపల్లి అగ్నిమాపక కేంద్ర అధికారి డి హేమ సుందర్ రావు సిబ్బంది పాల్గొనడం జరిగింది.

దర్జాగా బహిరంగ మల విసర్జన

విశాలాంధ్ర-భోగాపురం/ డెంకాడ : బహిరంగ మల విసర్జన జాతీయ రహదారి సాక్షిగా నిర్విఘ్నంగా కొనసాగుతోంది. చాలా రోజులుగా ఈ తంతు నడుస్తున్నా అధికారులకు, నాయకులకు మాత్రం కనిపించటంలేదు. నాతవలస టోల్ గేట్ నుంచి నాతవలస వరకు జాతీయ రహదారి నుండి ఉన్న సర్వీస్ రోడ్డులో ఫుట్‌పాత్‌లు మానవ వ్యర్థాలతో నిండిపోయాయి. విపరీతమైన దుర్గంధంతో ఆ రోడ్డు మీద వెళ్లే ప్రయాణీకులు ఇబ్బందులకు గురౌతున్నారు. ప్రతీరోజు అందరూ ఆ రోడ్డు గుండా వెళుతున్నారే తప్ప అక్కడ ఉన్న సమస్యను గురించి సరిచేయటం లేదు. అధికారులకు ఈ విషయం తెలుసా? తెలిసే ఊరుకున్నారా? అన్న విషయం తెలియటం లేదు. మలవిసర్జన రహితంగా గ్రామాలు ఉండాలని, స్వచ్ఛతకు పెద్ద పీట వేయాలని, గ్రామాలన్నీ స్వచ్ఛంగా ఉండాలని ప్రభుత్వం ఆదేశాలు ఇస్తుంటే, అందుకు బిన్నంగా క్షేత్ర స్థాయిలో పరిస్థితులు ఉంటున్నాయి. ప్రజలతో బహిరంగ మలవిసర్జన మాన్పించి, మరుగు దొడ్లు లేనివారికి మరుగు దొడ్ల సౌకర్యం కల్పించకపోతే పరిస్థితులు దారుణంగా మారి ప్రజా ఆరోగ్యం అంటువ్యాదులకు బలవ్వాల్సిందే. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామస్తులతో చర్చించి ఈ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

గిరిజనుల అభ్యున్నతికి కమిషన్ కృషి

రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకర్రావు పూసలు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : గిరిజనుల సమస్యల పరిష్కారానికి ఎస్టీ కమిషన్ కృషి చేస్తోందని రాష్ట్ర ఎస్టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు తెలిపారు. షెడ్యూల్ ప్రాంతాల్లో భూములపై గిరిజనులకే హక్కులు దక్కేలా చర్యలు తీసుకోవాలని ట్రైబల్ డెవలప్మెంట్ మిషన్ సంస్థ ప్రతినిధులు, అజయ్ కుమార్, తిరుమల రావు,గోపాల రావు,చందర్ రావు రాష్ట్ర ఎస్టీ కమీషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావుకు వినతిపత్రం అందజేసారు. విజయనగరం లోని క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం వారు కమిషన్ చైర్మన్ కలిసారు. గిరిజనుల అభ్యున్నతికి ప్రభుత్వం చేసిన చట్టాలు అమలయ్యేలా చూడాలని వారు వినతిపత్రం లో కోరారు. సీతంపేట ఐటిడిఏ పరిధిలో గిరిజన భూ సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో విస్తృత పర్యటనలు చేస్తూ వారి సమస్యలు ప్రత్యక్షంగా తెలుసుకుని సమస్యల పరిష్కారానికి కమిషన్ కృషి చేస్తోందని తెలిపారు.గిరిజన ప్రాంతవాసుల సమస్యలు కమిషన్ దృష్టిలో వున్నాయని, సంబంధిత చట్టాలు అమలు చేసేలా ప్రభుత్వాన్ని కమిషన్ కోరుతుందని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని గ్రామ సందర్శన చేసిన ఉపాధ్యాయులు

విశాలాంధ్ర-శృంగవరపుకోట రూరల్ : ఎస్ కోట మండలం తిమిడి జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు సత్యారావు, సుందరాడ అప్పారావు, సన్యాశిరావు, జగదీష్ గంగిరెడ్లపాలెం గ్రామం సందర్శించిరి, తల్లిదండ్రులతో మాట్లాడుతూ తమ పిల్లలను తిమిడి పాఠశాలతో చేర్పించి, నాణ్యమైన విద్య పొందేటట్లు ప్రోత్సహించాలని 'ఆ గ్రామ పెద్దలను కోరడం జరిగింది. ప్రభుత్వ బడిలో ఇంగ్లీషు మీడియం కూడా ఉందని, విషయ నిష్ణాతువైన ఉపాధ్యాయులు కూడా ఉన్నారని అందువలన ప్రవేట్ బడులకు పంపి బండెడు ఫీజులు చెల్లించడం దండగా, మీ దగ్గరలో ప్రభుత్వ పాఠశాల ఉండగా... అని అవగాహన కల్పించడం జరిగింది. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను తిమిడి పాఠశాలలో చేర్పించడానికి తమ అంగీకారం తెలిపినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. సూర్యప్రకాష్ మీడియా మిత్రులకు తెలియపరిచారు. ఈకార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ వబ్బిన శంకర్, తులసి వబ్బిన సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాలు సాగుతో భూమి సారవంతం

మల్లంపేట సర్పంచ్ వంగపండు పద్మావతి

విశాలాంధ్ర-బాడంగి : నవధాన్యాలు సాగు చేయడంవల్ల భూమి సారవంతమవుతుందని మల్లంపేట సర్పంచ్ వంగపండు పద్మావతి అన్నారు. బాడంగి మండలం ముగడ యూనిట్లో మల్లంపేట గ్రామంలో సర్పంచ్ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. నవధాన్యాలు సాగు నేలతల్లి బాగు కార్యక్రమంపై రైతులకు పూర్తి అవగాహన కల్పించారు. ప్రతి మహిళ ఇంటిదగ్గర కిచెన్ గార్డెన్ సాగు చేపట్టాలని కోరారు. రసాయనిక ఎరువులు వినియోగంతో కూడిన కూరగాయలు తినడం వల్ల మనిషి ఆరోగ్యానికి పెను ముప్పు వాటిల్లుతుందన్నారు. ఇంటి అవసరానికి కావలసిన కూరగాయలను పెరట్లో సాగు చేసుకోవడం వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని అన్నారు. వ్యవసాయ సాగులో క్రిమిసంహారక మందులను తగ్గించుకొని రైతులు పంటలు పండించాలని సూచించారు. ఈసందర్భంగా రైతులు వంగపండు పద్మావతి వంగపండు అప్పలనాయుడు సన్మానం చేసారు. ఈ కార్యక్రమంలోఎల్.ఎన్.వై.ఈశ్వరరావు ఐసిఆర్‌పిఎస్ ఇందిరా ఎస్.గోపయ్య ఎస్.ఎస్.జి మహిళలు ఫీల్డ్ అసిస్టెంట్ గ్రామంలో రైతులు పాల్గొన్నారు.

కేంద్రంలో మోడీ ప్రభుత్వం కార్మిక హక్కులు హరించే లేబర్ కోడ్స్ చట్టాల రద్దుకై
మే 20న సమ్మె జయప్రదం చేయండి

విశాలాంధ్ర-బొబ్బిలి : మతోన్మాద బిజెపి ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మికులు రక్తం చిందించి సాదించిన 44 కార్మిక చట్టాలను చట్ట సవరణ పేరుతో కార్మిక చట్టాల కోరలు తీసారని హక్కుల సాధనకై ఈనెల జరుగు కార్యక్రమం జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో మే 20 దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నిర్ణయించారు. ఈ జనరల్ బాడీ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు పి. శంకర్రావు మాట్లాడుతూ కనీస వేతనాలు చట్టం రద్దు చేస్తున్నారు. యాజమాన్యాలు, ప్రభుత్వాలు ఏసమయంలోనైనా కార్మికులను తొలగించే ఈ లేబర్ కోడ్స్‌లో పొందుపరిచారు. కార్మికులకు భద్రతగా ఉన్న ఈఎస్ఐ పిఎఫ్ లాంటి సౌకర్యాలు రద్దు అవుతాయి. బోనస్సు, సెలవులు రద్దవుతాయి కార్మికులను కట్టు బానిసలుగా మార్చే బిజెపి ప్రభుత్వం తెచ్చిన ఈ దుర్మార్గమైన లేబర్ కోడ్స్ చట్టాలను రద్దు చేయాలని దేశవ్యాప్తంగా జరుగుతున్న భారత కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక వర్గానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం బంగారు కుటుంబం పేరుతో పేదరికం నిర్మూలిస్తామని చెబుతున్న మాటలు పచ్చి అబద్ధాలు అని అన్నారు. కోటీశ్వరులు పేదవాళ్లకు ఎందుకు సాయం చేస్తారని అన్నారు. పేదరికం పోవాలంటే పోరాటాల ద్వారా సంపద పేద, ధనిక తేడా లేకుండా పంపిణీ జరిగితేనే పరిష్కారం తప్ప వేరే మార్గం లేదన్నారు. శ్రమజీవులందరూ తమ హక్కుల కోసం వీరోచిత పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు

విశాలాంధ్ర-బాడంగి : మండలం మల్లంపేట క్రీస్తు జ్యోతి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు శుక్రవారం నిర్వహించారు. గ్రామ పంచాయతీ పురవీధుల్లో క్రీస్తు శ్రమలు ను ధ్యానిస్తూ భక్తి శ్రద్ధలతో క్రైస్తవ కుటుంబ సభ్యులు అందరూ పాల్గొన్నారు . ఈ కార్యక్రమంలో ఏసు క్రీస్తు రూపములో యండవ అబ్రహం సోధరడు మరియు గ్రామ ఉపదేశి యజ్జల రాజశేఖర్ గారు గ్రామపెద్దలు కమిటీ సభ్యులు అందరూ పాల్గొని జయప్రదం చేసారు. అదేవిధంగా బాడంగి, భీమవరం, పాల్తేరు, కోడూరు, బొత్సవాన్ని పలస, వాడాడ,ముగడ తదితర గ్రామాల్లో గుడ్ ఫ్రైడే వేడుకలు తెల్లవారుజాము నుంచి చర్చల్లో ప్రత్యేక ప్రార్ధనలు చేపట్టారు. ఈసందర్భంగా ఫాదర్స్ క్రైస్తవ ఉద్దేశించి మాట్లాడుతూ మానవాళి పట్ల ప్రేమ..నిస్సహాయుల పట్ల కరుణ, శత్రువుల పట్ల క్షమ, ఆకాశమంతటి సహనం, అవధులు లేని త్యాగం జీసస్ జీవితం మానవాళి ఇచ్చిన సందేశమన్నారు. జీసస్ మహాత్యాగానికి గుర్తు గుడ్ ఫ్రైడే అన్నారు. ఆయా కార్యక్రమంలో గ్రామానికి చెందిన క్రైస్తవులందరూ పాల్గొన్నారు.

రాజాం : స్థానిక ఆర్సిఎం చర్చ్‌లో గుడ్‌ఫ్రైడ్ సందర్భంగా ప్రత్యేక ప్రార్ధనలు జరిగాయి. ఫాదర్ ఇసాక్ ఆధ్వర్యంలో జరిగిన ప్రార్ధనలలో పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మలుపు తిప్పిన కరుణామయున్ని శిలువపై శిక్షించి, రక్తాలు చిందించిన ఘట్టాలు ప్రదర్శిస్తూ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. పలు చర్చీలో ఫాదర్లు విశ్వాసకుల కాళ్లు కడిగారు. ప్రభువైన ఏసుక్రీస్తు చూపిన మార్గంలోసాగేందుకు క్రైస్తవ సోదరులు పెద్దఎత్తున పాల్గొని, కన్నీటి ప్రార్ధనలు చేసారు.

వివాహ మహోత్సవంలో పాల్గొన్న డాక్టర్ రాజేష్

విశాలాంధ్ర-సంతకవిటి : సంతకవిటి మండలం మండాకురిటి గ్రామంలో సమతం వారి వివాహ మహోత్సవంలో పాల్గొని నూతన వధూవరులు తారకేశ్వరరావు, కరుణలను ఆశీర్వదించిన రాజాం నియోజకవర్గం వైఎస్ఆర్సీపీ ఇంచార్జి డా. తలే రాజేష్, ఈ కార్యక్రమంలో సర్పంచ్ బత్తుల జ్యోతీశ్వరరావు, పెద్ది గోవింద, అన్నాజీ, డా.నరేంద్ర, ఆదినారాయణ, సమతం శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

ఫైర్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటిన పర్యావరణ పరిరక్షణ సమితి

విశాలాంధ్ర-రాజాం : అగ్నిమాపక వారోత్సవాలు సందర్భంగా రాజాంలో ఈరోజు ఫైర్ స్టేషన్ ఆవరణలో పర్యావరణ పరిరక్షణ ఆధ్వర్యంలో మొక్కలు నాటామని ఫైర్ ఆఫీసర్ జనార్ధనరావు తెలిపారు. అనంతరం పాలిథిన్ నిషేధం అమలుకు సహకారం గా 500 గుడ్డ సంచులు పంపిణీ చేశారు. పర్యావరణ సమితి కన్వీనర్ ఆర్.వి.జే.నాయుడు, రెడ్ క్రాస్ చైర్మన్ కొత్తా సాయి ప్రశాంత కుమార్, పెంకి చైతన్య, మానవత అధ్యక్షులు బి.వీ. అచ్యుత కుమార్, గట్టి పాపారావు, బాలమురళీ కృష్ణ, సత్యం నాయుడు మరియు ఫైర్ సిబ్బంది అందరూ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో ఆవుల మృతి అంటూ వైసీపీ అసత్య ప్రచారం

రాజకీయ లబ్ధి కోసం వాడుకోవాలని యత్నం : ఎమ్మెల్యే కోళ్ళ లలితకుమారి ఆరోపణ

విశాలాంధ్ర-వేపాడ : తిరుమల తిరుపతి దేవస్థానం గోశాలలో ఆవులు మృతి చెందాయంటూ వైకాపా మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి చేసిన అసత్య ప్రచారాన్ని ఖండిస్తూ ఆవుల మృతిని రాజకీయ లబ్ది కోసం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వాడుకోవాలని చూస్తుందని శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ళ లలితకుమారి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం లక్కవరపు కోటలోని పార్టీ కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తిరుమలలో ఆవుల మృతిని రాజకీయ లబ్ది కోసం వాడుకోవాలని ప్రయత్నించిన నీచపు పార్టీ వైసీపీ అని రోజురోజుకి సమాజంలో కరోనా వైరస్ మాదిరిగా మారిపోయిందని, ప్రతి రోజు ఏదో అసత్య ప్రచారాలు చేసి ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నదని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు.వైసిపి హయాంలో ఈఓ జవహర్ రెడ్డి, అదనపు ఈఓ ధర్మారెడ్డి మధ్య జరిగిన ఆధిపత్య పోరుతో గోశాల నిర్వహణను గాలికొదిలేశారని ఆమె విమర్శించారు.తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతిష్ఠకు భంగం కలిగించాలని ప్రయత్నించిన వారెవరైనా, దేవదేవుడి ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు.

లక్కవరపుకోట: టీటీడీ గోశాలలో ఆవులు మృతి చెందాయి అంటూ వైకాపా మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి చేసిన అసత్య ప్రచారాన్ని ఖండిస్తున్నామని ఎస్ . కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో గల పార్టీ క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఆమె తిరుమల లో ఆవుల మృతిని రాజకీయాల లబ్ధి కోసం వాడుకోవాలని ప్రయత్నించిన నీచపు పార్టీ వైసీపీ అని అన్నారు. వైసీపీ రోజురోజుకీ కరోనా వైరస్ మాదిరిగా మారిపోయిందని ప్రతిరోజు ఏదో అసత్య ప్రచారాలు చేసి ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. వైసిపి హయాంలో ఈవో జవహర్ రెడ్డి, అదనపు ఈవో ధర్మారెడ్డి మధ్య జరిగిన ఆది ప త్య కోరుతూ గోసాల నిర్వహణను గాలికి వదిలేసారని ఎమ్మెల్యే విమర్శించారు. తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతిష్టకు భంగం కలిగించాలని ప్రయత్నించిన వారు ఎవరైనా దేవుడు ఆగ్రహానికి గురికాక తప్పదని అన్నారు.

జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరణ

విశాలాంధ్ర-విజయనగరం కంటోన్మెంట్ : విజయనగరం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శిగా ఏ. కృష్ణ ప్రసాద్ బాధ్యతలు స్వీకరించినారు. విశాఖపట్నం జిల్లా గాజువాక అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా పని చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు మేరకు విజయనగరం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శిగా బదిలీ పై వచ్చారు. జిల్లా న్యాయ సేవా అధికార సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.

నేడు ఎమ్మెల్యే కోండ్రు ఆధ్వర్యంలో 'స్వచ్ఛ ఆంధ్ర' ర్యాలీ: కమిషనర్

విశాలాంధ్ర-రాజాం : స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల 19 వ తేదీ శనివారం ఉదయం 9 గంటలకు రాజాం లో భారీ ర్యాలీ జరుగనని మున్సిపల్ కమీషనర్ జె. రామప్పలనాయుడు తెలిపారు. ర్యాలీకి ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్ హాజరవ్వనున్నట్టు వెల్లడించారు. ప్రతీ నెలా 3 వ శనివారం ప్రభుత్వం ఆదేశాల మేరకు స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ర్యాలీలో అన్ని విభాగాల అధికారులు, సచివాలయాల సిబ్బంది పాల్గొనాలని ఆదేశించారు.

మార్క్ శంకర్‌పై వైసీపీ నాయకులు చేసిన వ్యాఖ్యలు సరికాదు

జనసేన పార్టీ చీపురుపల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ విసినిగిరి

విశాలాంధ్ర-చీపురుపల్లి : జనసేన పార్టీ అధ్యక్షుడు కొణిదెల పవన్ కళ్యాణ్ చిన్న కుమారుడు కొణిదల మార్క్ శంకర్ పై వైయస్సార్సీపి నాయకులు చేసిన వ్యాఖ్యలు అణిచితమైనవని హేయమైనవని చీపురుపల్లి జనసేన నియోజకవర్గం అన్నారు. శుక్రవారం చీపురుపల్లి నియోజకవర్గం జనసేన పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో చీపురుపల్లి నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్చార్జి విసినిగిరి శ్రీనివాసరావు మాట్లాడుతూ డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కళ్యాణ్ చిన్న అబ్బాయి మార్క్ శంకర్ పై అనుచితి వ్యాఖ్యలు చేసిన వైసీపీ నాయకుల తీరుపై మండిపడ్డారు. ఇటీవల వైసిపి నాయకురాలు రోజా స్పందిస్తూ గతంలో టిడిపి నాయకులు నారా చంద్రబాబునాయుడు కి ఈరోజు పవన్ కళ్యాణ్ కుమారుడుకి ఆ ఏడుకొండల వెంకటరమణ మూర్తి తప్పు చేసిన వారికి తన రుచి చూపిస్తాడని చేసిన వ్యాఖ్యలు పై జనసేన నేత విసినిగిరి తీవ్రంగా స్పందించారు. అలా అనుకుంటే గతంలో వైసీపీ నాయకులు ఏడుకొండలపై, ఆరు కొండలు చాలవా అని ఆరోపణలు చేసిన వారి పరిస్థితి ఏమైందో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలందరికీ తెలుసునని ఆయన అన్నారు. ఏడుకొండలవాడు తప్పు చేసిన వారిని ఎవరిని వదిలిపెట్టరని అందుకే 151 సీట్ల నుండి 11 సీట్లకి పరిమితి చేశారని ఎద్దేవా చేశారు. అలాగే చీపురుపల్లి నియోజకవర్గం లో ఇటీవల తనపై వైసీపీ చోటా నాయకులు చేసిన విమర్శలపై తీవ్రంగా స్పందించారు. నోరు ఉంది కదా అనే ఎలాబడితే అలా మాట్లాడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. మీ గల్లీ నాయకుడు చేస్తున్న అరాచకాలు అక్రమాలు అన్యాయాల దౌర్జన్యాలపై ప్రశ్నిస్తే దానికి బదులుగా సమాధానం చెప్పలేక వ్యక్తిగత విమర్శలు చేయడం ఎంత వరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. మేము మీ నాయకుల వ్యక్తిగత విషయాల్లోకి వెళితే రోడ్లమీద తిరిగే పరిస్థితి మీకు ఉండదని, అది మా విధానం అది కాదని ఏదైనా ఉంటే ప్రభుత్వ పాలసీల మీద ప్రభుత్వ విధానాల మీద మాట్లాడాలని సూచించారు. గతంలో మీరు చేసిన తప్పులు కప్పిపుచ్చుకోకుండా వాటిని సరిదిద్దుకునే ప్రయత్నం చేయాలని హితవు పలికారు. అలాగే గత వైసిపి ప్రభుత్వంలో మీరు దోచుకు తిన్న ప్రతి పైసాను కక్కించే వరకు జనసేన పార్టీ పోరాటం ఆపదని హెచ్చరించారు. మీ ఇంట్లో మహిళల పదవుల పై అధికారం చలాయించే మీరా మాకు నీతులు చెప్పేది అని సూటిగా ప్రశ్నించారు. రానున్న స్థానిక సంస్థల ప్రజాక్షేత్రంలో మీ అందరికీ మరోసారి ప్రజల బుద్ధి చెప్పడం ఖాయమని తెలిపారు. తాను తన జనసేన పార్టీ కార్యాలయం పైన నిర్వహిస్తున్న గెస్ట్ హౌస్ లను గురించి, మహిళలపై తప్పుగా మాట్లాడటం ఎంతవరకు సబబుని ప్రశ్నించారు. మీ వైసీపీ ఉత్తరాంధ్ర నాయకులు జిల్లాలో ప్రతి చోట లాడ్జిలను నడుపుతూ దాని క్రింద మీ వైసీపీ పార్టీ ఆఫీసులను కొనసాగించిన పరిస్థితిని మర్చిపోయారా అని గుర్తు చేశారు. జనసేన పార్టీ ఏ రోజు తప్పు చేయదని తప్పు చేసిన వాడు ఎంతటి వాడైనా వదిలిపెట్టేది లేదని, మీ ఉడత ఊపులకుపులకు చిల్లర వ్యాఖ్యలకు బెదిరేది లేదని హెచ్చరించారు. అలాగే మా కుటుంబాల లావాదేవీల గురించి మాట్లాడే ముందు మీ అధినేత జగన్మోహన్ రెడ్డి నీ తన తల్లికి, చెల్లికి, న్యాయం చేయమని చెప్పాలని సూచించారు. అలా కాదని అవాకులు చవాకులు మాట్లాడి బెదిరింపులకు దిగితే, ఇక్కడున్నది జనసేన పార్టీ గుర్తుపెట్టుకోండి చీపురుపల్లి నియోజకవర్గంలో వైసిపి పార్టీని అద:పాతాళానికి తొక్కి, చీపురుపల్లిలోవైసీపీ పార్టీ లేకుండా లేపేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో గుర్ల మండల పార్టీ అధ్యక్షులు యడ్ల సంతోష్ జనసేన పార్టీ నాయకులు కింతలి వాసుదేవరావు మరియు జన సైనికులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

డీఎఫ్ఓ రామ్ ప్రసాద్

విశాలాంధ్ర - కొత్తవలస : అగ్ని ప్రమాదాలపై ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని జిల్లా అగ్నిమాపక అధికారి బి.వి.ఎస్.రామ్ ప్రసాద్ సూచించారు. జాతీయ అగ్నిమాపక వారోత్సవాలు-2025లో భాగంగా కొత్తవలస మండలంలోని కంటకాపల్లి వద్దనున్న శారద మెటల్స్ అండ్ అల్లాయ్స్ లిమిటెడ్ పరిశ్రమలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కర్మాగారాల్లో పనిచేసే సమయంలో కార్మికులు అగ్నిప్రమాదాలకు గురికాకుండా సేఫ్టీ పద్ధతులు తప్పనిసరిగా పాటించాలన్నారు. సిబ్బంది మాక్ డ్రిల్ నిర్వహించి కార్మికులకు అవగాహన కల్పించారు. అగ్నిమాపక అవగాహన సదస్సులో భాగంగా అగ్నిమాపక వారోత్సవాలు విశిష్టతను వివరించారు. ఈ అవగాహన సదస్సులో ఇండస్ట్రియల్ ఫైర్స్, ఆయిల్ ట్యాంక్ ఫైర్స్, విద్యుత్ ఫైర్స్ తదితర అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించి... వాటిని నివారించుటకు ఉపయోగించు వివిధ రకాల ఎక్స్టింగువిసర్స్ మరియు ఫోమ్ తో వివిధ రకాల బ్రాంచీలతో ప్రయోగాత్మకంగా డెమో నిర్వహించారు. బహులంతస్తుల్లో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు అందులో చిక్కుకొని స్పృహ కోల్పోయిన వ్యక్తులను రోప్ సహాయంతో పైనుండి క్రిందకు ఏ విధంగా దించాలో ప్రయోగాత్మకంగా చూపారు. ఈ కార్యక్రమంలో కొత్తవలస అగ్నిమాపక అధికారి వై.అశోక్ కుమార్, శారద పరిశ్రమ ఏవిపి(హెచ్ఆర్)ప్రభాత్ మోహన్, డీజీఎం సన్యాసిరావు, సేఫ్టీ హెడ్ సూర్య భాస్కర్, ఫైర్ అండ్ సేఫ్టీ సీనియర్ మేనేజర్ పద్మాకర్, కొత్తవలస అగ్నిమాపక సిబ్బంది, శారద సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర జలశక్తి జల్ జీవన్ మిషన్,వాష్ ఎక్స్పర్ట్ గంగూలీ సుడిగాలి పర్యటన

ఎస్.కోట నియోజకవర్గంలో 90 కోట్లతో చేపట్టిన పనుల పరిశీలన

విశాలాంధ్ర-కొత్తవలస : కేంద్ర జలశక్తి జల్ జీవన్ మిషన్,వాష్ ఎక్స్పర్ట్ సోమేంద్ర రంజన్ గంగూలీ శుక్రవారం ఎస్.కోట నియోజకవర్గంలోని దెందేరు, చింతలపాలెం, చందలూరు, జాకేరు, భీమాలి, వెల్దాం తదితర గ్రామాలలో గ్రామీణ నీటి సరఫరా విభాగం ఎస్.ఇ ఎస్.కవిత తదితరులతో పాటూ సుడిగాలి పర్యటన చేశారు. ఎస్.కోట నియోజకవర్గంలోని కొత్తవలస, ఎల్.కోట, ఎస్.కోట, వేపాడ, జామి మండలాల్లో రూ.90 కోట్ల అంచనా వ్యయంతో సురక్షితమైన త్రాగునీరు సరఫరా చేయుటకు గ్రామాల్లో చేపట్టిన పనుల పురోగతిపై పరిశీలించారు. గ్రామీణ ప్రజలతో మమేకమై జల్ జీవన్ మిషన్ పనులపై ఆరా తీశారు. ఒక లక్ష్యంతో సురక్షితమైన త్రాగునీటి సరఫరా కోసం చేపట్టిన ప్రాజెక్టు పనుల పనితీరును.. అలాగే నియోజకవర్గ ప్రజల జీవనాడి అయిన తాటిపూడి జలాశయం నుండి సరఫరా చేయుచున్న త్రాగునీటి కల్పనపై సమగ్ర విశ్లేషణకు గానూ వివిధ గ్రామాలలో గ్రామసభల ద్వారా ప్రజలతో మమేకమై అనేక సందేహాలను నివృత్తి చేశారు. ఈ పర్యటనలో ఆర్.డబ్ల్యు.ఎస్ ఎస్.ఇ ఎస్.కవిత, ప్రాజెక్ట్ డి.ఈ వై.గోవిందరావు, డి.ఈ కె.ఆర్.వి.పైడిరాజు, థర్డ్ పార్టీ ఇన్స్పెక్షన్ ప్రతినిధి వెంకట్రావు, ఏఈలు సత్య కిషోర్, దేవి , సన్యాసిరావు, పార్వతి, గోవింద్, శైలజ, స్వచ్ఛభారత్ కన్సల్టెంట్లు జేజేఎం మరియు వాటర్ క్వాలిటీ పరీక్ష కన్సల్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, వి డబ్ల్యూ ఎస్సీ సభ్యులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు , అంగన్వాడి ఆయా, ఆశాలతో పాటు పలువురు సర్పంచులు ఎంపీటీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రామలింగాపురంలో 200లీటర్ల బెల్లపు ఊట, 4లీటర్ల సారాయి ధ్వంసం

విశాలాంధ్ర-కొత్తవలస : కొత్తవలస ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ జీ.ఎస్.రాజశేఖర్ నాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం కొత్తవలస మండలం, రామలింగాపురం గ్రామంలో నిర్వహించిన దాడుల్లో గ్రామ శివారులో నాటు సారాయి తయారీకి వినియోగించే సుమారు 200 లీటర్ల బెల్లపు ఊటతో పాటూ 04 లిటర్ల నాటు సారాయిని ధ్వంసం చేసినట్లు తెలిపారు. నాటుసారాయి తయారీ, రవాణ, విక్రయాలు వంటివి చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇన్ స్పెక్టర్ వి.ఎస్.రాజు, సిబ్బంది బి.ఆదినారాయణ, హరికిరణ్ లు పాల్గొన్నారు.

వైసిపి కార్యకర్తలకు అండగా ఉంటాం

మాజీ ఎమ్మెల్యే శంబంగి సోదరుడు వేణుగోపాలనాయుడు

విశాలాంధ్ర-బొబ్బిలి: మండలం నరసింహుని పేట వైసిపి కార్యకర్త గంట వెంకట నాయుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. సంఘటన తెలుసు కొని మాజీ ఎమ్మెల్యే శంబంగి సోదరుడు వేణు గోపాల నాయుడు మృతుడు వెంకట నాయుడు కుటుంబ సభ్యులను పరామర్శించారు.మృతుడు వెంకట నాయుడు కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే శంబంగి సోదరుడు వేణు గోపాల నాయుడు హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా శంబంగి వేణుగోపాల నాయుడు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వైసిపి కార్యకర్తలకు జగన్మోహన్ రెడ్డి సారధ్యంలో వైసిపి కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయనతో పాటు న్యాయవాది రుంకాన ప్రసాద్ ఉన్నారు.

నవధాన్యాలు సాగు - నేలతల్లి బాగు

విశాలాంధ్ర-వేపాడ : వ్యవసాయ రైతులు నవధాన్యాలు సాగు చేయడం వలన నేలతల్లి బాగుంటుందని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ సన్యాసమ్మ అన్నారు. మండలంలోని చామలాపల్లి పంచాయతీ శివారు పోతిబంది పాలెం గ్రామంలో శుక్రవారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున ప్రతి గ్రామంలో రైతులందరూ తమ పొలాలలో నువ్వులు జల్లుటకు సిద్ధమవుతున్నారు.కావున రైతులు నువ్వులతో పాటు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సరఫరా చేస్తున్నటువంటి నవధాన్యాల 1కేజీ కిట్టును మూడు కేజీల నువ్వులలో కలిపి ఒక ఎకరా పొలంలో జల్లాలని తెలియజేశారు.ప్రతి గ్రామంలో ఐసిఆర్పీలు రైతులకు అందుబాటులో ఉండి ఈ నవధాన్యల కిట్టులను అందజేస్తున్నారన్నారు.కాగా కరకవలస యూనిట్ సిబ్బంది రైతులకు నవధాన్య కిట్టులను పంపిణీ చేశారు.అలాగే ప్రతి గ్రామములో చెరువు పనుల వద్దకు వెళ్లి ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులకు నవధాన్యాల వలన ఉపయోగాలను వివరించడం జరుగుతుంది. కావున రైతులందరూ కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకొని ప్రతి రైతు తమ పొలాలలో నవధాన్యాలు సాగు చేసి నేలను సారవంతం చేసుకోవాలని తెలియజేశారు.

అగ్నిప్రమాదాల నివారణే ధ్యేయం

అగ్నిమాపక అధికారి జనార్ధన్ రావు

విశాలాంధ్ర-రాజాం : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక లక్ష్మీగ్యాస్ ఏజెన్సీతోపాటు వస్త్రపురి కోలనీలోని పెట్రోల్ బంక్‌లో స్థానిక అగ్నిమాపక అధికారి టిఎస్ఎస్ జనార్ధనరావు ఆధ్వర్యంలో సిబ్బంది అగ్నిప్రమాదల నివారణపై అవగాహన కల్పించారు. ప్రమాదల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. గ్యాస్ లీకేజీద్వారా చెలరేగే మంటలను అదుపు చేయడంపైన మాక్ డ్రిల్ రూపంలో డెమో నిర్వహించారు.